## క్లుప్తంగా

### వర్షాలు కురవాలని పూజలు

**వెల్దండ:** మండలంలోని చౌదర్‌పల్లిలో వర్షాలు బాగా కురవాలని సోమవారం గ్రామస్తులు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు డప్పు వాయిద్యాల మధ్య నైవేద్యం తీసుకొని గ్రామ శివారులోని పాల బండపై వరదపాశం పోశారు. అనంతరం గ్రామస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో కృష్ణయ్యయాదవ్, సాయిలు, ఈరయ్య, జంగయ్య, లచ్చయ్య, వెంకటయ్య, తిరుపతయ్య, జంగయ్య, ఎల్లయ్యగౌడు, శ్రీశైలం, తిరుపతయ్యయాదవ్ ఉన్నారు.

### మిత్ర ఫౌండేషన్ చేయూత

**కల్వకుర్తిరూరల్:** పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన శివకుమార్ గౌడ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు సోమవారం బాధితుడి ఇంటికి వెళ్లి రూ.5 వేల ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### మంత్రిని కలిసిన గోలి శ్రీనివాస్‌రెడ్డి

**వెల్దండ:** మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం హైదరాబాదులో మంత్రి హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సమస్యలు, ప్రస్తుత రాజకీయ స్థితిగతులపై చర్చించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, నాయకులు తదితరులు ఉన్నారు.

### కాంగ్రెస్‌లో చేరిక

**చారకొండ:** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సోమవారం డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన సింగిల్ విండో డైరెక్టర్ జగన్, వార్డు సభ్యులు గజ్జె కొండల్, బీజేపీ నాయకులు విష్ణు, మరో 30 మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి మహేందర్, మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, మాజీ జెడ్పీటీసీ భీముడు, వెంకట్ గౌడ్, శంకర్ గౌడ్, నర్సింహారెడ్డి, యూత్ ప్రెసిడెంట్ గణేష్ తదితరులు ఉన్నారు.

### పోషమ్మ దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

**వెల్దండ:** మండలంలోని కుప్పగండ్లలో నూతనంగా నిర్మిస్తున్న పోషమ్మ దేవాలయానికి సోమవారం సర్పంచ్ మట్ట శారదమ్మ భూమి పూజ చేశారు. దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్, నాయకులు వెంకట్‌రెడ్డి, పరమేష్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

**తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి..**

**పెద్దకొత్తపల్లి:** మండల కేంద్రంలో ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.1.70 కోట్లతో మండల కేంద్రంలో నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి ఎంపీటీసీ వెంటరి రేణుక, నాగరాజు, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాగరాజు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, మాజీ సర్పంచ్ నర్సింహ, నాగరాజు, బాలస్వామి, వెంకటస్వామి, రాజశేఖర్, లక్ష్మణ్‌శెట్టి, బాలనారాయణ పాల్గొన్నారు.

### హామీల అమలులో ప్రభుత్వం విఫలం

**కొల్లాపూర్:** హామీల అమలులో ప్రభుత్వం విఫలం అయ్యిందని టీడీపీ మండల అధ్యక్షుడు రామస్వామియాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహలక్ష్మికి రూ.6లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు, మైనార్టీలకు రిజర్వేషన్లు పెంచాలన్నారు. ఈమేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ కార్యాలయంలో అందజేశారు. ఓర్సు రామకృష్ణ, సుధాకర్, చంద్రయ్య, నాని, ఆంజనేయులు గౌడ్ తదితరులున్నారు.

### సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

**పెంట్లవెల్లి:** మండల కేంద్రానికి 11/33 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు అయ్యింది. ఈ మేరకు సోమవారం 22, 27 సర్వే నెంబర్‌లో 30 కుంటల ప్రభుత్వ భూమిని విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీ చంద్రమౌళి, నాయకులు రాజేష్, జిల్లా కోఆప్షన్ మెంబర్ మతీన్, మాజీ ఉప సర్పంచ్ భాస్కర్, ఏఈ, పాల్గొన్నారు.

### భారీ ర్యాలీ



**కల్వకుర్తి రూరల్:** బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలకు నిరసనగా బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణ పురవీధుల గుండా ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి, రాఘవేందర్ గౌడ్, బీజేవైఎం నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ ముదిరాజ్, దుర్గాప్రసాద్, నర్సిరెడ్డి, సురేందర్ గౌడ్, రవి గౌడ్, పరశురాములు తదితరులు ఉన్నారు.

# ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



ఎల్లూరులో బోనాలతో వెళ్తున్న మహిళలు

**లింగాల:** మండల కేంద్రంలో సోమవారం పోచమ్మ తల్లి బోనాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బోనాలను పూలతో అలంకరించి మహిళలు గ్రామ దేవత బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా అప్పాయపల్లి వెళ్లే మార్గంలో ఉన్న పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదేవిధంగా మండలంలోని కొత్తకుంటపల్లిలో బోనాల పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కోనేటి తిర్పతయ్య, పర్వతాలు, సింగిల్ విండో చైర్మన్, వైస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, వెంకటగిరి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**కొల్లాపూర్ రూరల్:** మండలంలోని ఎల్లూరు, చుకాయపల్లి గ్రామాల్లో పోచమ్మ బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా అమ్మవారి దేవాలయానికి వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పోతురాజుల విన్యాసాలు

# ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

**లింగాల:** ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. మండలంలోని జీల్గుపల్లి తండాలో మూడు రోజుల నుంచి నిర్వహించిన లింగమయ్య ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు చివరిరోజు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలన్నారు. అంతకుముందు యంత్ర, ప్రాణ, విగ్రహ ప్రతిష్ఠ, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తండాలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మోకురాల కృష్ణమోహన్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

# కరాటేలో బ్రిలియంట్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

**కల్వకుర్తి టౌన్:** జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ జడ్చర్లలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో పట్టణంలోని బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీనియర్స్ స్పైరింగ్ విభాగంలో 6వ తరగతికి చెందిన కె. సాన్వి, పి. ఆరోష్, ఎస్‌డీ మిస్బ బంగారు పథకాలు సాధించారు. కటాస్ విభాగంలో సాకేత్, అభిజ్ఞ, తరుణ్, రనధర్మతేజ వెండి పథకాలు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఓవరాల్ విభాగంలో హరినాక్షి, హరిత్, ఆర్యన్‌సింగ్, ఎతేశ్యామ్, అక్షజ్‌రెడ్డి, తన్విష్, హరిక, జాన్ ఆశ్రమ్‌లు కాంస్య పతకాలు సాధించారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ రేణుధర్ విద్యార్థులను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

**జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బంగారు పథకం..**

**చారకొండ:** మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి ఎం. పవన్ తేజ కరాటే పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో హెచ్ఎం శంకర్ నాయక్ విద్యార్థి పవన్‌తేజను అభినందించి సన్మానించారు.

# ఘనంగా మల్లలమ్మ ఉత్సవాలు



పూజలు చేస్తున్న కాపరులు

**కొల్లాపూర్ రూరల్:** మండలంలోని కుడికిల్ల గ్రామ సమీపంలో ఉన్న మల్లలమ్మ దేవత ఉత్సవాలను గొర్ల కాపరులు ఘనంగా నిర్వహించారు. గొర్ల కాపరులు తమ గొర్లను ఒకరోజు అమ్మవారి సన్నిధిలో ఉంచి పూజలు చేయడం ఆనవాయితీ. ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు గొర్లను అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉంచారు. కాపరులు అక్కడే వంటలు చేసుకొని కుటుంబసభ్యులతో సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో గొర్ల కాపరులు, పెద్దలు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

**బల్మూర్:** విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందిన ఘటన మండలంలోని గోదల్‌లో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుద్దటి మల్లయ్యకు చెందిన ఆవు మేత కోసం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలోకి వెళ్లి ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యాదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ అధికారులు పరిశీలించి పంచనామా చేయించారు. ఆవు విలువ సుమారు రూ. 60వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**అచ్చంపేట రూరల్:** విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఈఓ గోవిందరాజులు హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో వివిధ అంశాలపై చర్చించారు. విద్యార్థులు గణితం, ఆంగ్ల భాష నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలకు క్రమం తప్పకుండా, సమయపాలన పాటించాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని కోరారు. ఆయన వెంట విద్యశాఖ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఆప్షనల్ హాలిడే ప్రకటించాలి

**అచ్చంపేట రూరల్:** కేజీబీవీలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు రాఖీ పౌర్ణమి రోజు ఆప్షనల్ హాలిడేగా ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సూర్య శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో డీఈఓ గోవిందరాజులును ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈనెల 31న రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళా ఉద్యోగులకు సెలవు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బీచ్యానాయక్, జె. శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న గ్రామస్తుడు

**చారకొండ:** గుంటూరు జిల్లాకు చెందిన వ్యక్తి మండలం మీదుగా ఆదివారం బైక్‌పై షాద్‌నగర్‌కు వెళ్తుండగా మర్రిపల్లి వద్ద రూ.20 వేల విలువ గల సెల్‌ఫోన్ కింద పడింది. మర్రిపల్లి గ్రామానికి చెందిన బిట్ల అంజన్‌రెడ్డికి సెల్‌ఫోన్ కనిపించింది. కొంత సమయానికి ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి ఫోన్ చేయగా వివరాలు తెలిపాడు. దీంతో బాధితుడు సోమవారం మర్రిపల్లికి గ్రామానికి చేరుకున్నాడు. సర్పంచ్ నరేష్ నాయక్ ఆధ్వర్యంలో బాధితుడికి సెల్‌ఫోన్ అందించారు. నిజాయితీ చాటుకున్న అంజన్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

# అమరవీరుల స్ఫూర్తితో పోరాడుతాం

**నాగర్‌కర్నూల్‌రూరల్:** అమరవీరుల స్ఫూర్తితో రైతాంగ ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల 23వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొస్తే రాష్ట్రం ప్రభుత్వం మద్దతు తెలిపిందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, కందికొండగీత, అశోక్, కాశన్న, తారాసింగ్, రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

# బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి

**నాగర్‌కర్నూల్:** బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం తెలకపల్లి మండలం ఆలేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గ రూపురేఖలు పూర్తిగా మారాయన్నారు. పూర్తిగా వలసలు తగ్గాయన్నారు. గతంలో కరెంట్ లేక రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. పాదయాత్ర ద్వారా గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ఇంజనీరింగ్ కళాశాల, ప్రతి మండల కేంద్రానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు బైకాని శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ చైర్మన్ కుర్మయ్య, మాజీ మార్కెట చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలి

**నాగర్‌కర్నూల్‌రూరల్:** మున్సిపల్ కార్మికులకు పెంచిన ఏరియర్స్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ టెక్నికల్, నాన్‌టెక్నికల్ తేడా లేకుండా అందరికి సమానమైన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కార్యక్రమంలో సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, జిల్లా కోశాధికారి అశోక్, వెంకటయ్య, కృష్ణయ్య, పరుషరాములు తదితరులు పాల్గొన్నారు.





ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

## మోసపూరిత ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం



**బిజినేపల్లి:** మోసపూరిత ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీపాచారి అన్నారు. సోమవారం మండలంలోని మహదేవుని పేట, గంగారం గ్రామాల్లో గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మోసపూరిత హామీలతో ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో భూషయ్య, జాకీర్ హుస్సేన్, లక్ష్మీనారాయణ, చంద్రకళ, నారాయణాచారి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని అదృశ్యం

**అచ్చంపేట రూరల్:** మండలంలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై సోమవారం విద్యార్థిని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల ప్రకారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని ఈనెల 24న ఇంటి నుంచి కళాశాలకు వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వాళ్ల నుంచి వాకబు చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు

## ఆర్థికసాయం

**లింగాల:** మండల కేంద్రానికి చెందిన మేంద్రగుత్తి భాగ్యమ్మ అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం పలువురు కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ కొండల్‌రావు రూ.5వేలు, లింగాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పూజారి వెంకటయ్య రూ.2వేల ఆర్థికసాయం అందజేశారు.

## ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం



**బిజినేపల్లి:** ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై తిమ్మాజీపేట మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం ఎస్సై భాస్కర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. దానం బాలరాజు, మాధవులు, ఎండీ ఉస్మాన్, హర్షవర్ధన్‌రెడ్డి దామోదర్‌రెడ్డి, ఆశోక్‌గౌడ్, వెంకటయ్య, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**తెలకపల్లి:** ఇతర పార్టీల నాయకులను గెలిపిస్తే ఓటర్లను కాల్చివేస్తానని ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి వ్యాఖ్యలపై బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొత్తపల్లి కుమార్ నిరసన తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే వెంటనే ఓటర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బొప్పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు పృథ్వీరాజు, రాంచందర్, శివశంకర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



**తెలకపల్లి:** మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాకొండలోని కస్తూర్బా పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, బీసీ గురుకుల పాఠశాలలో సోమవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బిచ్చానాయక్, శివప్రసాద్, చంద్రశేకర్, సాజిద్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం

**తాడూరు:** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జ్ సబిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక రంగాలపై మక్కువ పెంచుకోవాలన్నారు. ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మౌనిక, న్యాయవాదులు మధుసూదన్‌రావు, శ్యాంప్రసాద్‌రావు, ఎస్ఓ విజయ పాల్గొన్నారు.

## సాగునీటి ప్రవాహం తగ్గించాలి

**కోడేరు:** మండలంలోని జొన్నలబొగుడ రిజర్వాయర్‌నుంచి కేఎల్ఐ ప్రధాన కాలువ ద్వారా అధికారులు సాగునీరు వదలడంతో సోమవారం కోడేరు, పాన్‌గల్ బ్రాంచ్ కాలువకు అధికారులు ఎక్కువగా నీరు వదలడంతో ముత్తిరెడ్డిపల్లి వద్ద కేఎల్ఐ కాలువ ఎక్కి పారుతుంది. నీటి సామర్థ్యం తగ్గించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీంతో కాలువలు తెగిపోయే ప్రమాదం ఉందని అధికారులు స్పందించి నీటి సామర్థ్యం తగ్గించాలని రైతులు కోరుతున్నారు.



# భవన నిర్మాణ కార్మికుల నిరసన

**నాగర్‌కర్నూల్‌రూరల్:** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ గేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికుల చట్టాలను సంరక్షించాలన్నారు. 1996, 1979 చట్టాలను పునరుద్ధరించాలని ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన మోటార్‌సైకిల్‌ను, స్కూటీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు నిధులను దారి మళ్లించొద్దన్నారు. 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ.5 వేలు, రూ.10 వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, అశోక్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

# సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓకు వినతి



ఎంపీడీఓ లక్ష్మణ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

**ఉప్పునుంతల:** గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని రాయిచెడ్ గ్రామానికి చెందిన బీజేవైఎం నాయకులు జగదీష్, అంజి, మహేష్ యాదవ్‌లు సోమవారం ఎంపీడీఓ లక్ష్మణ్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో తొమ్మిదేళ్ల కిందట ఎస్సీ కమ్యూనిటీ భవనం నిర్మాణ పనులు ప్రారంభించారని పిల్లర్ల స్థాయిలోనే అర్ధాంతరంగా పనులు నిలిపేశారని వివరించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీలో రెండేళ్ల నుంచి గ్రామసభలు నిర్వహించడంలేదని పేర్కొన్నారు.

# వీరభద్ర దేవాలయంలో సామూహిక వ్రతాలు

**వెల్దండ:** మండల కేంద్రంలోని అయ్యబావి వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం సామూహిక వ్రతాలు నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా శివుడికి, వీరభద్రస్వామికి, అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ బలిజ సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు విశ్వనాథం, కుమారప్ప, పరమేశ్వర్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, వజ్రలింగం, ఉమేష్, కౌశిక్ తదితరులు ఉన్నారు.



వ్రతాలు చేస్తున్న భక్తులు

## బీజేపీ నాయకుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

**కొల్లాపూర్:** పట్టణంలోని శ్మశాన వాటికలకు మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సాయికృష్ణగౌడ్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని శ్మశాన వాటికల అభివృద్ధికి గతంలో నిధులు మంజూరయ్యాయన్నారు. కాంట్రాక్టు పనులు దక్కించుకున్న వారు పనులు చేపట్టడం లేదన్నారు. దీంతో స్మశాన వాటికలకు ప్రహరీలు లేక స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జలాల్ శివుడు, నాయకులు కద్దాల కృష్ణ, శేఖర్, ఎల్లయ్యయాదవ్, రమేష్, శివకృష్ణ, భరత్‌కుమార్, జగపతిరావు తదితరులున్నారు.

# ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి



లింగాల ప్రజావాణిలో పాల్గొన్న డీపీఓ

**లింగాల:** ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని డీపీఓ, మండల ప్రత్యేకాధికారి కృష్ణ అధికారులకు సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో డీపీఓ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఏఓ నాగార్జునరెడ్డి, సర్వేయర్ రాంబాబు, ఏపీఎం బాలస్వామి, ఎమ్మార్ఐ తిర్పతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



పెంట్లవెల్లిలో ప్రజావాణి

**చారకొండ:** భూ సమస్యలను ప్రజావాణి ద్వారా పరిష్కరించుకోవచ్చని డిప్యూటీ తహసీల్దార్ విద్యాధరి అన్నారు. మండల కేంద్రంలో ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తెలిపారు.

**ప్రజావాణికి అధికారులు గైర్హజరు..**

**పెంట్లవెల్లి:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఒక అధికారి మాత్రమే హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు గైర్హజరయ్యారు.

## బీఆర్ఎస్‌లో చేరిక

**పెంట్లవెల్లి:** బీఆర్ఎస్ ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం కొల్లాపూర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మండల కేంద్రంతో పాటు, ఎంగంపల్లి తండా చెందిన దాదాపు 50 మంది మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు వర్గీయులు ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు, సురేందర్‌గౌడ్, మురళి, బీమ్లా, కృష్ణానాయక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న మాక్ పోలింగ్

**మన్ననూర్:** స్థానిక పీటీజీ పాఠశాలలో సోమవారం విద్యార్థులు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్లు, అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. క్యూ లైన్‌లో నిలబడి విద్యార్థులు ఓటు వేశారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూముల్లో భద్రపరుచడంతో పాటూ ఓట్ల కౌంటింగ్ తదితర అంశాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కోసమే మాక్ పోలింగ్ నిర్వహించినట్లు హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.